క్లుప్తంగా

పోలీసులకు నిందితుడి అప్పగింత

భీమదేవరపల్లి : మండలంలోని ముత్తారం గ్రామంలోని త్రికూటేశ్వరాలయంలో చోరీకి యత్నించిన మ్యాక వినయ్‌ను గ్రామస్తులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా.. త్రికూటేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు .జరుగుతున్నాయి. సోమవారం రాత్రి సీసీ కెమెరాలు బిగించారు. కాగా వాటిని గ్రామానికి చెందిన కాశిరెడ్డి ఆదిరెడ్డి సెల్ ఫోన్‌కు లింక్ చేశారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో వినయ్ ఆలయంలోకి వెళ్లి హుండీలను పగులగొడుతుండగా సెల్‌ఫోన్‌లో గమనించిన ఆదిరెడ్డి గ్రామస్తులతో వెళ్లి వినయ్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

పశు వైద్యశిబిరం



శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ 52 ఆడ పశువులకు సూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కట్టని వాటికి చికిత్స చేసి మందులు అందించారు. అలాగే 21 దూడలకు నట్టల నివారణ మందులు, 34 పశువులకు సాధారణ చికిత్స చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ మౌనిక రవికిరణ్, ఎంపీటీసీ స్వాతి విష్ణు, వీఎల్ఓ రమేష్ బాబు, జేవీఓ సారంగం తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ గ్రహీతకు అభినందన

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పెద్ది మానస మాస్టర్ ఆఫ్ ఎడ్యూకేషన్ (ఎంఈడీ)లో గోల్డ్ మెడల్ సాధించగా ఆమెను సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎల్బీ కాలేజీ అధ్యాపకులు, కుటుంబీకులు మంగళవారం అభినందించారు. మానస వరంగల్‌లోని ఎల్బీ కాలేజీలో ఎంఈడీ చదువుతోంది. ఆమె ప్రతిభ చాటి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్ సీపీ ఆనంద్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. మానసను పలువురు అభినందించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



కమలాపూర్ : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్ ఆధ్వర్యంలో మండలంలోని శనిగరంలో ఆ పార్టీ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చరణ్‌పటేల్ వివరాలు వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా నిగ్గుల లింగయ్య, అధ్యక్షుడిగా వరికోలు వెంకట్రాజం, ఉపాధ్యక్షుడిగా బండ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గూడూరు శ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిగ్గుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొబ్బల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వెలిశెట్టి వంశీ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేశిని శ్రీను, వరికోలు శ్రీను, నిగ్గుల వేణు, తోట ప్రభాకర్, రమేష్, నీలం సంపత్, వీరారెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం అధ్యక్షుడిగా రాజు ఎన్నిక



ఎల్కతుర్తి : పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా అంబాల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఇందిరానగర్‌లో సంఘం 16వ వార్షిక మహాసభ మండల సమితి అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కడారి మురళి, పాలకవర్గ సభ్యులుగా రమేష్, జయంత్, కడారి ఎల్లయ్య, దాసారపు రాజమౌళి, సాతూరి సురేష్, కిరణ్, కుమారస్వామి, కొమురయ్య, నాగయ్య, గణకులుగా రాజు, పున్నంచందర్, రవి ఎన్నికయ్యారు.

‘ఎంపీ వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు’

ఐనవోలు : ప్రజలను గందరగోళానికి గురిచేసేలా, నాయకుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఏఐసీసీ కోఆర్డినేటర్, మధ్యప్రదేశ్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సౌకర్యాలు కల్పించండి

శాయంపేట : మండలంలోని మైలారంలోని కరీంసాబ్ దర్గాకు వెళ్లడానికి సీసీ రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలకు దర్గా కమిటీ ప్రెసిడెంట్ అక్బర్ పాషా మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కమిటీ సభ్యులు రఫీ ఉన్నారు.

వ్యాయామం చేయాలి

ధర్మసాగర్ : దినచర్యలో భాగంగా వ్యాయామం చేయాలని మా భాగమేనని సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ తెలిపారు. మండల కేంద్రంలో క్యాన్సర్, మధుమేహం, పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధుల నివారణపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజాలను వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, ఉపసర్పంచ్ బొడ్డు అరుణ, ఫార్మసిస్ట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం

శాయంపేట : సైక్లింగ్ చేస్తే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సాయికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హెల్త్ మేళాకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరై సైక్లింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సైక్లింగ్ వల్ల శారీరక సమస్యల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్ కందగట్ల రవి, ఎంపీటీసీ చంద్రప్రకాశ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.నందం, ఉపసర్పంచ్ సుమన్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజూ అరగంటపాటు నడవడంతోపాటు యోగ, సైక్లింగ్, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీహర్షుడు, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, భీమళ్ల సారయ్య, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

కమలాపూర్ : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాలుర హైస్కూల్‌లో సైక్లోథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ తొక్కడం, వ్యక్తిగత ఆరోగ్యంలో నడక, వ్యాయామం, జాగింగ్ ప్రాధాన్యతలపై వైద్యాధికారి డాక్టర్ హర్షిణీప్రియ అవగాహన కల్పించారు. విద్యార్థులకు హ్యాండ్ వాష్ టెక్నిక్స్ నేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్కూరి విజయ, హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రాధాన్యం

దామెర : అంగన్‌వాడీ టీచర్ల, వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పన తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాసనసభలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ధర్మారెడ్డి చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు వాణి మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు కోమల, వనజ, జ్యోతి, జయ, పుష్ప, సులోచన తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

‘పుల్వామా’ అమరులకు నివాళి



దామెర : పుల్వామాలో ఉగ్రవాదుల దాడి ఘటనలో అమరులైన సైనికులకు ఏకశిలా పాఠశాల విద్యార్థులు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ధినేష్‌రెడ్డి మాట్లాడారు. సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ‘కంటి వెలుగు’ లక్ష్యం

కమలాపూర్ : అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైద్యాధికారి డాక్టర్ హర్షిణీప్రియ తెలిపారు. మండలంలోని 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక చేనేత పారిశ్రామికుల ఉత్పత్తి, విక్రయ సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు ప్రత్యేక శిబిరంలో పలువురు చేనేత కార్మికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షిణీప్రియ మాట్లాడారు. కమలాపూర్, కన్నూరు గ్రామాల్లో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాలను కంటి వెలుగు క్వాలిటీ కంట్రోల్ పరిశీలకుడు డాక్టర్ చొక్కయ్య సందర్శించారు. శిబిరాల్లో డాక్టర్ మౌనిక, రేణుక, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు కల్పన, హరికృష్ణ, డాటా ఎంట్రీ ఆపరేటర్ శృతి, పీహెచ్‌ఎన్ దయామణి, హెల్త్ సూపర్‌వైజర్ విప్లవ్‌కుమార్, డీఈఓలు ప్రభాకర్, దేవరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చొక్కయ్య

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి



సంపత్‌రెడ్డి, అధ్యక్షుడు

భీమదేవరపల్లి: పొదుపు ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని గాంధీనగర్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కేతిరి సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధీనగర్ పురుషుల పొదుపు సంఘ వార్షిక 3వ మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి రాంపెల్లి కుమారస్వామి వార్షిక నివేదిక చదివి సమర్పించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం సంపత్‌రెడ్డి మాట్లాడారు. సంపాదనలో కొంత పొదుపు చేసుకోవాలని సూచించారు. సంఘం అధ్యక్షుడిగా రెండోసారి కేతిరి సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బుర్ర నారాయణ, డైరక్టర్లుగా తాళ్లపల్లి భాస్కర్, కుమార్, తాళ్లపల్లి ప్రభాకర్, తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎల్కతుర్తి : కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని యూత్‌కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి అదారి రాజేందర్ కోరారు. మండలంలోని సూరారం, బావుపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ‘యూత్ జోడో–బూత్ జోడో’ కార్యక్రమాలకు ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మండల సుమన్‌గౌడ్, మొలంగూరి భాస్కర్, దాట్ల రాముడు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌కు సర్పంచ్ రావుల సరితరెడ్డి మంగళవారం కుర్చీలను బహూకరించారు. ఆమెను అంగన్‌వాడీ సిబ్బంది శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజా, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డికి నాయకుల సత్కారం, శుభాకాంక్షలు



కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, మాజీ సర్పంచ్ రవి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

‘రక్తదాత దేవోభవ’ పురస్కారానికి ఎంపిక

కమలాపూర్ : ఇప్పటివరకు 23 సార్లు రక్తదానం చేసిన మండల కేంద్రానికి చెందిన ఆడెపు శ్రీకాంత్‌ను ‘రక్తదాత దేవోభవ’ పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురస్కారాలతో సత్కరిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న అవార్డు అందజేస్తామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని శ్రీ గట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను ఆలయ కమిటీ చైర్మన్ పేరబోయిన రవి ఆహ్వానించారు. ఈ మేరకు రవి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు హనుమకొండలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజయ్యను మంగళవారం కలిసి మాట్లాడారు. తొలుత బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, సర్పంచ్‌లు గోదల రాజిరెడ్డి, సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ సురేష్, ప్రభాకర్‌రెడ్డి, అర్చకుడు వినయ్ శర్మ, పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లెలో చేపట్టిన రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వేసిన తారు రోడ్డు నాణ్యత లేక కంకరతేలిందన్నారు. అయినా అధికారులు పరిశీలించలేదని తెలిపారు.

కెపాసిటర్లు తప్పనిసరి


భీమదేవరపల్లి : వ్యవసాయ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో డీఈ సామ్యానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని రైతు వేదికలో నారాయణగిరి, కొత్తకొండ, ముల్కనూర్ సెక్షన్ అధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరులోగా రైతులందరూ కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ముల్కనూర్ ట్రాన్స్‌కో ఏడీ రాజు, ట్రాన్స్‌కో ఏఈలు శిరీష్‌కుమార్, కుమారస్వామి, ఏఓ శ్రీలత, లైన్ ఇన్‌స్పెక్టర్ టి.సామ్యూల్ సిబ్బంది ఉన్నారు.

మండలంలో టీపీసీసీ అధ్యక్షుడి పర్యటన



ఐనవోలు : ‘హాథ్ సే హాథ్ అభియాన్ యాత్ర’ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి బసచేసే ప్రాంతాన్ని మంగళవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. బుధవారం రాత్రి రేవంత్‌రెడ్డి ఐనవోలుకు చేరుకుని బస చేస్తారని తెలిపారు. గురువారం ఉదయం శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకుని అనంతరం మండలంలోని ఐనవోలు, పెరుమాండ్లగూడెం, పంథిని గ్రామాల మీదుగా పాదయాత్ర చేస్తారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండూరు వెంకట్‌రెడ్డి, మార్నేని వెకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డీజే వినియోగించొద్దు



పరకాల : రాత్రివేళలో డీజే వినియోగించొద్దని సీఐ పుల్యాల కిషన్ స్పష్టం చేశారు. ఏసీపీ శివరామయ్య ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీజే సౌండ్ నిర్వాహకులకు మంగళవారం ఆయన కౌన్సిలింగ్ చేశారు. అనుమతి తీసుకోకుండా డీజే ఏర్పాటు చేయవద్దని, అధిక సౌండ్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో సందర్శన

ఐనవోలు : పుట్టపర్తి సత్యసాయి జిల్లా గ్రామాభివృద్ధి లీడర్స్, రాయలసీయ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) సభ్యులు సుమారు 40 మంది మండలంలోని ఒంటిమామిడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించారు. హెచ్‌ఎం గోపు ఆరోగ్యమ్మ, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పొన్నాల రాజు పాఠశాల అభివృద్ధి, నిర్వహణ, పాఠశాలలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ సభ్యులు శ్రీమల్లికార్జున, డైరక్టర్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌కు చెందిన రామాంజనేయులు, బాలవికాస పీఎం మంజులరెడ్డి, రమ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన జన్ను మల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం 50 కేజీల బియ్యం అందజేశారు. తొలుత పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు జన్ను సాంబయ్య, జన్ను విద్యాసాగర్, గౌరవ సలహాదార్లు జన్ను రమేష్, నల్ల మురళి, అధ్యక్షుడు జన్ను వినయ్, ప్రధాన కార్యదర్శి నల్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ధర్మసాగర్ (వేలేరు) : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. సమావేశానికి జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా కబ్జాదారులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఎందుకు వెనక్కి తగ్గుతున్నారని సభ్యులు నిలదీశారు. మండలంలో అక్రమంగా మొరం దందా జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో అర్హుల ఎంపికలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఎంపీడీఓ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని కన్నారంతోపాటు ఏయే గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిపేశారో లిఖితపూర్వకంగా సమాచారం ఇస్తే ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, తహసీల్దార్ సమ్మయ్య, వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జానీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

ప్రజాసేవ కోసమే జీఎంఆర్‌ఎం ట్రస్ట్

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించడానికే జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆ ట్రస్ట్, విన్ మోటార్స్ ఆధ్వర్యంలో యువతకు ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా 18 నుంచి 40 ఏళ్ల వరకు వయస్సున్న యువతకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించడంతోపాటు పైసా ఖర్చు లేకుండా స్లాట్ బుక్ చేసి టెస్టు చేయించి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ట్రస్ట్ జనరల్ సెక్రటరీ గండ్ర గౌతంరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు బాసాని చంద్రప్రకాశ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అధికార దుర్వినియోగంతో ‘చల్లా’ భూదందా

● బీజేపీ పాలక్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ నియోజకవర్గంలో కాంట్రాక్ట్ పనులు, భూదందాలు చేస్తున్నాడని బీజేపీ ఆలేరు పాలక్, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపించారు. పరకాల మున్సిపాలిటీ 56, 57 బూత్‌ల పరిధిలోని శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ దంచనాల సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా భిక్షపతితోపాటు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ పాలక్, కొత్తగూడెం అసెంబ్లీ పాలక్ దేవునూరి మేఘనాథ్ మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.జయంత్‌లాల్, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

ఆత్మకూరు : మండలంలోని మల్కపేట, కొత్తగట్టు బూత్ కమిటీల ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి అధ్యక్షతన కొత్తగట్టులో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయచంద్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సదానందం, కోశాధికారి నాగరాజు, ఓబీసీ సెల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందం తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు దుప్పట్లు పంపిణీ

ధర్మసాగర్ : లెప్రసీ అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కరుణాపురంలోని కొలంబోనగర్‌లోని లెప్రసీ వ్యాధిగ్రస్తులకు జిల్లా కుష్టు నిర్మూలన అధికారి డాక్టర్ మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం పండ్లు, స్టీల్ ప్లేట్లు, దుప్పట్లు, బ్రెడ్‌లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్‌రావు మాట్లాడారు. లెప్రసీ రోగులు కంటి వెలుగు కేంద్రాల్లో నేత్ర సంబంధిత వైద్యపరీక్షలు చేయించుకుని అవసరమైతే అద్దాలు వాడాలని చెప్పారు. హెచ్‌ఈఓ సందెల శ్రీనివాస్ మాట్లాడుతూ రోగులకు ఆరోగ్య విధానాలను వివరించారు. లెప్రసీ గురించి ఇతరులకు అవగాహన కల్పిస్తామని, రోగులతో ఆదరణపూర్వకంగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, ఫాదర్ సుధాకర్, సీహెచ్‌ఓ నెహ్రూ చంద్‌నాయక్, డీపీఎంలు కొంరయ్య, రవీందర్, సతీష్‌రెడ్డి, సువార్త, బుచ్చినర్సయ్య, హెచ్‌వి విజయలక్ష్మి, ఏఎన్‌ఎం రజిత, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

కూలీలందరికీ ‘ఉపాధి’ పనులు

కమలాపూర్ : జాబ్ కార్డు కలిగిన కూలీలందరికి ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించనున్నట్టు ఎంపీడీఓ పల్లవి తెలిపారు. ఆ మేరకు ఉద్యోగులు చొరవ చూపాలని ఆమె ఆదేశించారు. మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, గోపాల్‌పూర్ గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి పనుల్లో తీసిన పూడిక మట్టిని అవసరమైనన్ని ట్రాక్టర్లను సమకూర్చి రైతుల పొలాల్లోకి తరలించాలని సూచించారు. నర్సరీల్లో ప్రైమరీ బెడ్లు ఏర్పాటు చేసుకుని విత్తనాలు వేసి చనిపోయిన మొక్కల స్థానంలో పెంచాలని చెప్పారు. కార్యక్రమాల్లో ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు శకుంతల, శ్రీనివాస్, భగవాన్‌రెడ్డి, టీఏలు సంతోష్, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలరాజు, కిరణ్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పల్లవి

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమదేవరపల్లి: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజీజ్‌ఖాన్ అన్నారు. మండలంలోని గట్లనర్సింగపూర్ హైస్కూల్‌లో కబడ్డీ క్యాంప్ మంగళవారం నిర్వహిచగా ఆయన మాట్లాడారు. అనంతరం క్రీడకారులకు కబడ్డీ కిట్లు అందజేశారు. భీమదేవరపల్లి జోన్ ప్రెసిడెంట్ సంపత్‌రావు,సెక్రటరీ పి.సునీల్, మాజీ ఎంపీపీ సంగసంపత్, వంగ మల్లయ్య, మొగిలి, రవిందర్, రాంబాబు ఉన్నారు.



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

బాధితులకు రక్షణ కల్పించేలా ‘సఖి’

ఐనవోలు : మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించేలా సఖి కేంద్రం సేవలు అందిస్తోందని నిర్వాహకులు వినీల, కరుణ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామండలోని ప్రభుత్వ పాఠశాలలో ‘సఖి’ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ శ్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాలికలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. లైంగిక వేధింపులు, గర్భ విచ్ఛిత్తి, ఇతరత్రా అంశాలను వివరించి పరిష్కారాలు సూచించారు. సమస్యల్లో ఉన్న మహిళలకు, బాలికలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందిస్తామని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వినీల, కరుణ

విద్యార్థుల ప్రతిభ



భీమదేవరపల్లి : ఇటీవల భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా సాయి కబడ్డీ పోటీలో గట్లనర్సింగపూర్ జీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థాయిలో నిలిచినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు పచ్చునూరి కర్ణాకర్ తెలిపారు. ఈ మేరకు భీమదేవరపల్లి, గట్లనర్సింగపూర్ మధ్య జరిగిన పోటీల్లో గట్లనర్సింగపూర్ విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థినిలకు పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి, పీఈటీలు పచ్చునూరి కర్ణాకర్, ఉమ ప్రియాంక విద్యార్థినిలను అభినందించారు.